క్లుప్తంగా

పాడి పశువుల పెంపకంతో ఆదాయం

సీతంపేట: పాడి పశువుల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చని ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అన్నారు. శుక్రవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజన లబ్ధిదారులకు గోకులం పథకం ద్వారా పాడి పశువులను అందజేయనున్నామన్నారు. మేలుజాతి పాడిపశువుల ఎంపిక, పశుగ్రాసం పెంపకం, గోశాల నిర్వహణ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌ఓ ఎస్వీ గణేష్, పశుసంవర్ధకశాఖ ఎ.డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

పాలకొండ రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులు, ఆలోచనా విధానాలను పదునుపెట్టేందుకు ఉపాధ్యాయులు వారిని అన్నివిధాలా ప్రోత్సహించాలని ఎంఈఓ కె.సోంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భావిశాస్త్రవేత్తలను తీర్చిదిద్దే క్రమంలో కేంద్రం చేపడుతున్న ఇన్‌స్పైర్ మనక్ పురస్కారాలను పొందేందుకు విద్యార్థులను సిద్ధం చేయాలని సైన్స్ ఉపాధ్యాయులకు సూచించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..



వైఎస్సార్ కూడలి వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పాలకొండ రూరల్: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై కె. ప్రయోగమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్న వారిని గుర్తించి, వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



నాగూరులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

గరుగుబిల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు సూచించారు. మండలంలోని నాగూరులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి ముందు చెత్తా చెదారం, అనవసర నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అలాంటప్పుడే దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయని, తద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి శిరీష, ఎంపీడీవో జి.పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

విక్రంపురంలో ..



కొమరాడ: ముురుగునీటిని పరిశీలిస్తున్న ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

కొమరాడ: జ్వరాలకు ప్రధాన కారణమైన దోమల వ్యాప్తి నియంత్రణలో డ్రైడే చాలా కీలకమైనదని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని విక్రంపురంలో శుక్రవారం చేపట్టిన డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో అనవసర నీటి నిల్వలు ఉండకుండా చూడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు.

వీరఘట్టంను అభివృద్ధి చేసేందుకు కృషి

- ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీని అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. వీరఘట్టం ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ చేశారు. సుడా ఆధ్వర్యంలో రూ.26 లక్షలతో లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే రహదారి మధ్యలో కలియుగ భీముడు కోడి రామ్మూర్తినాయుడు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సుడా జేఈ జగదీశ్వరరావు, జామి లక్ష్మీనారాయణ, బల్లా హరిబాబు, ఉదయాన ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

పేరులోనే గొప్ప..



పైచిత్రంలోని రేకులషెడ్డులో పాఠాలు బోధిస్తున్న పాఠశాల పేరు చావిడివలస మోడల్ ప్రైమరీ స్కూల్. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 75 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి పాఠాలు చెప్పేందుకు ఐదుగురు ఉపాధ్యాయులున్నా.. భవనం మాత్రం ఒక్కటే ఉంది. ఉన్న ఒక్క ఇరుకు గదిలోనే పాఠాలు బోధిస్తున్నారు. ఉపాధ్యాయులు చందాలు వేసుకుని, గ్రామస్తుల సహకారంతో రేకుల షెడ్డు ఒక్కటి వేసుకున్నారు. దీంతో రేకుల షెడ్డులో కొన్ని తరగతులు నిర్వహిస్తున్నారు. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- కనీస సౌకర్యాలు లేని పాఠశాలలను మోడల్ ప్రైమరీగా మార్పు
- నేటికీ రేకుల షెడ్డుల్లోనే తరగతులు
- ఉపాధ్యాయులుంటే భవనాలు నిల్.. భవనాలు ఉన్నచోట ఉపాధ్యాయులు లేరు
- విద్యార్థులకు తప్పని అవస్థలు



పైచిత్రంలో కనిపిస్తున్నది కిల్లాడ పాఠశాల. ఇక్కడ భవనం కాస్త పరవాలేదు అనిపించినా టీచర్లు లేరు. ఒకే ఒక్క ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చిన తర్వాత ఒక హెచ్‌ఎంతో పాటు మరో నలుగురు ఉపాధ్యాయులను నియమించాలి. అయితే ఉపాధ్యాయుల భర్తీ జరగకపోవడంతో ఒకే ఒక్క ఉపాధ్యాయుడు ఒకటి నుంచి ఐదు తరగతులకు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇతనితో పాటు మరో భాషా వలంటీర్ మాత్రమే ఉన్నారు. ఇలాగే కిండంగిలో కేవలం ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్నారు. ఇక్కడ కూడా ఇదే పరిస్థితి. పెద్దూరు ప్రైమరీ మోడల్ స్కూల్‌లో కూడా ఇంకా టీచర్లను నియమించలేదు.

సీతంపేట:

సీతంపేట ఏజెన్సీలో 16 వరకు పాఠశాలలను అప్‌గ్రేడ్ చేశారు. అయితే ఆయా పాఠశాలల్లో సౌకర్యాలు లేవు. సౌకర్యాలు పోనీ ఉన్నాయంటే ఉపాధ్యాయులను నియమించని పరిస్థితి. మండలంలో 169 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 11 వేల మంది విద్యార్థినీ,విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో సీతంపేట జీఈఎస్, పెద్దూరు, కిల్లాడ, కిండంగి, చావిడివలస, చింతమానుగూడ, హడ్డుబంగి, కిరప, జొనగ, మానాపురం, సీది, మర్రిపాడు, మండ పాఠశాలలను మోడల్ ప్రైమరీలుగా మార్పు చేశారు. ఒక్కో పాఠశాలలో 75 మందికి తక్కువ కాకుండా మొత్తం సుమారు 900 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో వసతుల కొరత ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వీటికి నాడు – నేడు కింద నిధులు మంజూరు చేసినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం వాటిని సకాలంలో పూర్తి చేయలేకపోయింది. ఎటువంటి మౌలిక వసతులు లేకుండానే మోడల్ ప్రైమరీ పాఠశాలలు నిర్వహించడంపై విమర్శలువినిపిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.



సీతంపేట పాఠశాలలో పూర్తికాని 'నాడు - నేడు' అదనపు భవనం

ఎంఈఓ ఏమన్నారంటే...

మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చిన పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని ఎంఈఓ ఎం.ఆనందరావు తెలిపారు. కొద్ది పాఠశాలల్లోనే ఇద్దరు వరకు ఉపాధ్యాయులున్నారని మిగతా వారు కూడా త్వరలో వస్తారన్నారు. భవనాల విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

ఎరువుల కోసం తప్పని నిరీక్షణ



ఎరువుల కోసం పెద్దూరు రైతు సేవా కేంద్రం వద్ద వేచిఉన్న రైతులు

గరుగుబిల్లి: ఎరువుల కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. రోజూ రైతు సేవా కేంద్రానికి వెళ్లినా ఎరువులు దొరకడం లేదని పలువురు వాపోతున్నారు. మండలంలోని పెద్దూరు గ్రామ రైతు సేవా కేంద్రం పరిధిలో ఎరువులు కావాల్సిన రైతుల వివరాలను వ్యవసాయ సిబ్బంది తొలుత సేకరించారు. ఆ వివరాల ప్రకారం కాకుండా తమకు నచ్చిన వారికి ఇచ్చేస్తున్నారు. దీంతో ఎరువుల కోసం పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఎరువులు దొరికే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఎరువులు కావాల్సి ఉన్న రైతులు, పేర్లు నమోదు చేసుకున్న రైతులు ప్రతిరోజూ రైతు సేవా కేంద్రాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ విషయమై అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను రైతులు ప్రశ్నిస్తే చూస్తాం.. ఇస్తాం.. అని కాలయాపన చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ సిబ్బంది అనుసరిస్తున్న తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రైతులకు ఎరువులు అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇంటర్మీడియట్ ఎంతో కీలకం



విద్యార్థులతో మాట్లాడుతున్న డి.ఐ.ఈ.ఓ నాగేశ్వరరావు

వీరఘట్టం: విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ ఎంతో కీలకమని డీఐఈఓ వై.నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యలో వెనుకబడితే జీవితంలో ఏదో పోగొట్టుకున్నట్లు ఉంటుందన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే కష్టపడి ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. చెడు మార్గాల వైపు వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. అలాగే అధ్యాపకులతో మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేపట్టాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం వడ్డన చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ త్రినాథ్, అధ్యాపకులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా శేఖర్



కృతజ్ఞతలు తెలియజేస్తూ మొక్కను అందిస్తున్న శేఖర్

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గుమ్మలక్ష్మీపురానికి చెందిన నిమ్మక శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఆయన జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగిలో పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణిలను శుక్రవారం కలిసి వారికి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్ఠానం మేర నడుచుకుంటున్నానని, పార్టీ మరింత బలోపేతానికి పాటుపడతానని తెలిపారు.

ప్రమాదకరంగా రంధ్రాలు..



నులకజోడు కూడలిలో వంతెన ముందు ఏర్పడిన రంధ్రాలు

భామిని: మండలంలోని నులకజోడు సెంటర్ సమీపంలో ఏబీ రోడ్డుపై రెండు కళ్లలా కనిపించే రెండు రంధ్రాలు వాహనదారులను భయపెడుతున్నాయి. వంశధార వరద కాలువపై నిర్మించిన బ్రిడ్జ్‌కు, అప్రోచ్ తారు రోడ్డుకు మధ్యలో రెండు రంధ్రాలు ఏర్పడ్డాయి.

అవి క్రమక్రమంగా పెద్దవి కావడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రంధ్రాలను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలి



మాట్లాడుతున్న కవి గౌరునాయుడు

గుమ్మలక్ష్మీపురం: తెలుగు సాహిత్యంపై ప్రతిఒక్కరూ మక్కువ పెంచుకోవాలని కవి గంటేడ గౌరునాయుడు కోరారు. స్థానిక డిగ్రీ కళాశాలలో కథా రచన అవగాహన కార్యశాల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కథా రచయిత మల్లిపురం జగదీష్‌లు కథలు రాయడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సామాజిక స్పృహ కలిగి చూసిన సంఘటనకు వాస్తవిక రూపం కల్పించి చక్కని వాక్య నిర్మాణంతో పాఠకుడిని ఆలోచింపజేసేదే రచన అని తెలిపారు. రచన ఆద్యంతం పాఠకుడిని చదివించగలిగితే రచన, రచయితలో పట్టు ఉన్నట్టేనన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షుడు డి.రామయ్య, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ పశుసంవర్ధక యూనిట్ ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరిలో కొత్తగా నిర్మించిన గ్రామీణ పశుసంవర్ధక యూనిట్‌ను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం ప్రారంభించారు. రూ.26.50 లక్షల నాబార్డు నిధులతో చేపట్టిన ఈ నిర్మాణం సేవలు సద్వినియోగం చేసుకోవాలని పాడిరైతులను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ సీహెచ్ దీనకుమార్, పశువైద్యాధికారి పి.లక్ష్మణరా వు, ఏఎంసీ చైర్మన్ కె.కళావతి పాల్గొన్నారు.

కుట్టుమూర్తుల తయారీలో నైపుణ్యం పెంపొందించుకోవాలి

సీతానగరం: నిరుద్యోగులైన టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళ లంతా నైపుణ్యంతో కూడిన శిక్షణ పొంది ఆర్థికంగా లబ్ధి చేకూర్చుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గతంలో కుట్టుమూర్తుల తయారీ కేంద్రాల్లో శిక్షణ పొందిన వారు ప్రస్తుతం బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టుమూర్తుల తయారీకి శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ మేరకు అందరూ కుట్టు శిక్షణ పొంది నప్పటికీ కుట్టుమూర్తుల తయారీలో నైపుణ్యం పెంపొందించు కోవాలని కోరారు. ఇప్పటికే 30 మందివరకూ కుట్టుమూర్తులు తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్లు, శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో ఎరువులు

- ఏపీ రైతు సంఘ నాయకుడు బుడితి డిమాండ్



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘ నాయకుడు బుడితి డిమాండ్

పాలకొండ: రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని ఏపీ రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. కూటమి సర్కారు ఎరువులు అందించడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంతవరకు రైతులకు ఎరువులు అందించలేకపోయారన్నారు. దీంతో అన్నదాతలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ మార్కెట్‌లో అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్‌కేలకు అరకొరగా వస్తున్న ఎరువులు పూర్తి స్థాయిలో సరిపోవడం లేదన్నారు. ఎరువులు సక్రమంగా అందించని ఎడల ఉద్యమం చేయక తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు కిమిడి రామ్మూర్తినాయుడు, బచ్చల లక్ష్మణరావు, కిమిడి త్రిపురాంతకరావు ఉన్నారు.

ఘనంగా ఎఫ్‌పీఓ పదో వార్షిక మహాజన సభ

సీతంపేట: చిన్నబగ్గ పంచాయతీ మోహన్‌కాలనీలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరివికాసం రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ) పదో వార్షిక మహాజన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీఓ అధ్యక్షుడు కె.కర్రన్న, కోశాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మహాజన సభ అంశాలు, అంతర్గత ఆడిట్, సభ్యుల ఎంపిక, వ్యాపార కార్యకలాపాలపై వివరించారు. సంస్థ డైరెక్టర్ సంజీవరావు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు ఆర్గానిక్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. అలాగే పసుపు పంట విస్తీర్ణం పెంచాలన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు ఎస్.ఆనందరావు, వసంత, వెన్నెల, మిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వృద్ధుల ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యుడు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొండవాడ, లుంబేసు గ్రామాల్లో ఆంధ్ర వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఆయా శిబిరాలకు పలు ఆరోగ్య సమస్యలతో హాజరైన వారికి వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కొండవాడలో 63 మందికి, లుంబేసులో 79 మందికి వైద్య సేవలందించినట్లు వైద్యుడు డి.శ్రీనివాసరావు తెలిపారు. ఇకనుంచి తమ సంస్థ తరఫున ప్రతినెలా 18వ తేదీన ఈ రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం



కె.అచ్యుతరావు

గరుగుబిల్లి: వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం చినమేరంగి కోటలో శనివారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు మరిశర్ల బాపూజీనాయుడు హాజరై, పార్టీ మరింత బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించడంపై దిశానిర్దేశం చేయనున్నారన్నారు. మండలంలోని వివిధ హోదాల్లో పార్టీ పదవులు అనుభవిస్తున్న వారంతా సమావేశానికి హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి పద్మావతి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శెట్టి పద్మావతి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఎంపీపీ శెట్టి పద్మావతి ఆదేశించారు. కురుపాం మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు తమ పరిధిలోని సమస్యలను ప్రస్తావించారు. నీలకంఠాపురం సర్పంచ్ ఎ.మన్మథరావు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో 150 మందికి పైగా తల్లికి వందనం పథకం నగదు నేటికీ పడలేదని ఎందుకు అలా జరిగిందని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. కో–ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని మాట్లాడుతూ కురుపాం సీహెచ్‌సీలో బెడ్లు చాలక ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు పేషెంట్లు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని, సీహెచ్‌సీ ఆవరణలో 90 శాతం నిర్మాణ పనులతో నిలిచిన నూతన భవన నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సర్పంచ్‌లు వి.జ్యోతి, మన్మథరావు మాట్లాడుతూ జరడ, నీలకంఠాపురం రైతు సేవా కేంద్రాలకు ఎరువులు నేటికీ రాలేదని, రైతులంతా ముమ్మరంగా వ్యవసాయ పనులు చేపడుతున్న వేళ..ఎరువులు అందించకపోతే ఎలా అని ప్రశ్నించారు. జరడ పంచాయతీలో ఏనుగుల దాడిలో మృతి చెందిన వారికి నేటికీ నష్టపరిహారం రాలేదని సర్పంచ్ జ్యోతి తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ జ్వరాలు ప్రబలుతున్నాయని వైద్యారోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అలాగే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జి.సుజాత, వైస్ ఎంపీపీ బి.అన్నాజీరావు, ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కూటమి హామీల అమలుపై నిలదీద్దాం

- వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: ప్రజలకు కూటమి ఇచ్చిన ఎన్నికల హామీల అమలుపై వైఎస్సార్ సీపీ తరఫున నిలదీద్దామని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి పిలుపునిచ్చారు. మండలంలోని చినమేరంగి కోటలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన పార్టీ గుమ్మలక్ష్మీపురం మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆమె హాజరై ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగిస్తున్న తీరుపై మండిపడ్డారు. కూటమి నాయకుల అవినీతి, అక్రమాలను బయటపెట్టేందుకు పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేయాలని కోరారు. అన్ని పథకాలు అమలు చేయకుండా ఒకట్రెండు పథకాలు అరకొరగా అమలు చేస్తూ ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగిస్తున్న తీరును గడపగడపకూ వివరించాలన్నారు. కురుపాం నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా పాలనా దక్షత లేని వారు కూడా తల, తోక లేకుండా విమర్శలు చేస్తున్నారని, దమ్ముంటే ఆధారాలు బయటపెట్టి ఆరోపణలు చేయాలని సవాలు విసిరారు. వారు ఇప్పుడు రెడ్‌బుక్‌తో భయపెడితే మనదగ్గరా బ్లూ బుక్ ఉందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో సహా ఇచ్చిపడేద్దామని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు.

కూటమి కుయుక్తులు, కుతంత్రాలకు భయపడేది లేదన్నారు. ప్రజలకు కూటమి ఇచ్చిన ప్రతి హామీ అమలయ్యేలా పోరాడాలన్నారు. అనంతరం కొమరాడ మండలంలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలోనూ కూటమి మోసపూరిత పాలనపై ఇదే తీరు కనబరిచారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. అంతకుముందు పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం తప్ప చేసిన అభివృద్ధి, సంక్షేమం లేదని విమర్శించారు. సమావేశంలో ఎంపీపీ దీనమయ్య, వైస్ ఎంపీపీలు ఎస్.శేఖర్, లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎం.రాధిక, నాయకులు గోరిశెట్టి గిరిబాబు, పి.గౌరీశంకరరావు, నిమ్మక గోపాల్, నాగేశ్వరరావు, పార్టీ కొమరాడ మండలం కన్వీనర్ డి.జనార్దననాయుడు, జెడ్పీటీసీ లక్ష్మి, ఎంపీపీ శ్యామలాదేవి పాల్గొన్నారు.